


అక్కన్నపేట మండలంలోని గుబ్బడి గ్రామ శివారులో కమ్మేసిన పొగ మంచు, జనగామ గ్రామంలో దారి కనిపించనంతగా కమ్ముకున్న మంచు

మంచు దుప్పటి

ఆదివారం తెల్లవారుజామున జిల్లాను మంచు దుప్పటి కమ్మేసింది. పల్లెలు, పట్టణాల్లో పొగమంచు అలుముకున్నది. ఉదయం 8 గంటలైనా మంచు తెరలు తొలగలేదు. రోడ్డు కనిపించనంతగా మంచు కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కొంతమంది వాహనాల లైట్లు వేసుకొని వెళ్లారు. అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాలు ఉదయం వేళ పొగమంచులో చిక్కుకున్నాయి. చలి తీవ్రత అంతగా లేకున్నా మంచు రావడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– అక్కన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి)

కుట్టు కూలి ఇంతేనా?



రూ.75 అని చెప్పి రూ.40 మాత్రమే పంపిణీ.. ఇంకా చేతికందని రెండో విడత డబ్బులు

- స్కూల్ యూనిఫామ్ ఆర్డర్లు తీసుకున్న మహిళా సంఘాల ఆగ్రహం
- జిల్లా వ్యాప్తంగా రూ.6,18,755 పెండింగ్
- తక్కువ ధర చెల్లించడంతో ఇష్టారీతిగా యూనిఫామ్‌ల తయారీ
- కొలతలు సరిగ్గా లేని దుస్తులతో విద్యార్థుల సతమతం

సిద్దిపేట అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్‌లను కుట్టి అందించే బాధ్యతను ప్రభుత్వం డీఆర్డీఏ, మెప్మాలకు అప్పగించింది. ఆసక్తి గల పొదుపు సంఘాల మహిళలకు ఈ ఆర్డర్లను అధికారులు అందజేశారు. ప్రభుత్వమే మెటీరియల్ సరఫరా చేయగా, కుట్టేందుకు మహిళలకు అప్పగించారు. ఇందుకు సంబంధించి మొదటి విడతలో 82,117, రెండో విడతలో 87,117 యూనిఫామ్‌లను కుట్టేందుకు డ్రెస్ మెటీరియల్‌ను అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 14 వందల మంది మహిళలు యూనిఫామ్‌లను కుట్టారు. ఒక యూనిఫామ్‌కు కుట్టు కూలిని రూ.75గా ప్రభుత్వం నిర్ణయించింది. అసలే నామమాత్రపు ధర చెల్లిస్తుండగా అందులోనూ మెటీరియల్ కటింగ్ పేరిట కోత విధిస్తున్నారు. ఈ కాస్త అయినా సకాలంలో చెల్లించడం లేదు. మొదటి విడత చెల్లింపులు దాదాపు పూర్తి కాగా, రెండో విడత కుట్టుకూలిని ఇంతవరకు విడుదల చేయలేదు.

రెండో విడత ఇంకెప్పుడిస్తారు?

జిల్లా వ్యాప్తంగా రెండో విడతలో 82117 యూనిఫామ్‌లను కుట్టగా రూ.75 చొప్పున రూ.6,18,755 బిల్లు పెండింగ్‌లో ఉన్నది. నెలలు గడుస్తున్నా కూడా మొదటి విడతను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా

తరువాయి 8వ పేజీలో



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

కదిలిస్తే కన్నీళ్లే..

- ఒకే కుటుంబంలో నలుగురి మృతితో విషాదంలో పోతారం
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు 7



అందమైన చేతి రాతను చూపిస్తున్న ఏఈవో వంశీకృష్ణ

అందమైన రాత.. ముత్యాల పోత

- వృత్తి వ్యవసాయాధికారి.. ప్రవృత్తి 'కాలిగ్రఫీ' ఆర్టిస్ట్
- చేతి రాతతో మంత్రముగ్ధులను చేస్తున్న ఏఈవో 7

పట్టుబట్టి.. కొలువులు కొట్టి

- మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ప్రీతి 7



దీపోత్సవం

వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో ఆదివారం కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రమిదలు, వత్తులు, నూనెను అందజేయగా భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

– వర్గల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి)

'ప్రయాస్' తొలి జాబితాలో

దామరకుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

మర్కుక్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో నిర్వహించే ప్రయాస్ (ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ ఆటిట్యూడ్ అస్పైరింగ్ స్టూడెంట్స్)కు మర్కుక్ మండలంలోని దామరకుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి వెంకటరాములు ఆదివారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పారితోషికాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయాస్ పేరిట పోటీల నిర్వహణ చేపట్టింది. దీనికి దామరకుంట జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులు లింగ వైష్ణవి, బోయిని సింధూజ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, గైడ్ టీచర్ చిన్న బ్రహ్మయ్య పర్యవేక్షణలోని ప్రాజెక్టు ఎంపికైంది. వారిని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సెక్టోరియల్ అధికారులు రామస్వామి, భాస్కర్ అభినందించారు.

విద్యుత్ సమస్యల

పరిష్కారమే లక్ష్యం

- విద్యుత్ శాఖ గజ్వేల్, హుస్నాబాద్ డీఈలు



హుస్నాబాద్ డీఈకి ఫిర్యాదు అందజేస్తున్న వినియోగదారులు

గజ్వేల్/హుస్నాబాద్‌రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ ఆర్. భానుప్రకాష్, హుస్నాబాద్ డీఈ రావుల కిష్టయ్య తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంతో పాటు, గజ్వేల్ సబ్ డివిజన్, ములుగు, తుక్కాపూర్ కార్యాలయాల్లో, హుస్నాబాద్‌లోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వినియోదారులకు ఏ సమస్య లేకుండా చూసుకోవడమే తమ లక్ష్యమన్నారు. విద్యుత్ భద్రతలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో లూజు వైర్లు ఉన్నట్లు తమకు సమాచారం అందిస్తే వెంటనే సమస్య పరిష్కరిస్తామన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం వర్తిస్తుందని ఒక వేళ ఎవరికైనా లబ్ధిజరగకపోతే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని లేదా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హుస్నాబాద్ పట్టణంలో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నా తమకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదని కొందరు డీఈ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై విచారణ చేసి అర్హులైన వారికి విద్యుత్ మీటర్లు అందజేస్తామని డీఈ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీలు ఆయా మండలాల విద్యుత్ శాఖ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



పటాన్‌చెరు మెట్రో రైలుకు

పచ్చజెండా

- సంగారెడ్డి జిల్లాలో పరుగులు పెట్టనున్న మెట్రో
- పట్టాలెక్కనున్న పనులు
- నెరవేరనున్న పారిశ్రామికవాడ ప్రజల కల
- డీపీఆర్ సిద్ధం కావడంతో పాటు నిధుల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ 7

నత్తనడకన కల్వర్టు పనులు

- ప్రమాదకరంగా చేర్యాలలోని గాంధీచౌక్, బస్టాండ్ దారి 8



కిషన్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

పాలిటెక్నిక్ విద్యార్థుల

నడకయాతన

హుస్నాబాద్ నుంచి మూడు కిలోమీటర్ల దూరం.. సమయానికి రాని బస్సులు

తప్పక నడిచి వెళ్తున్న విద్యార్థులు.. కళాశాలలో సమస్యల తిష్ఠ

హుస్నాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణ పరిధి కిషన్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి కాదు, రెండు కాదు పలు రకాల సమస్యలు వేధిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో కళాశాల ఉండటంతో విద్యార్థులు న(ర)డక యాతన పడుతున్నారు.

2017లో పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం

పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కిషన్‌నగర్‌లోని పదెకరాల స్థలంలో జిప్లస్ వన్ భవనంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించి 2017 సంవత్సరంలో ప్రారంభించారు. డిప్లొమా సివిల్ ఇంజనీరు, డిప్లొమో ఎలక్ట్రికల్ కోర్సులు ఉన్నాయి. ఏటా 60 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం 300 మంది వరకు విద్యనభ్యసిస్తున్నారు. ప్రారంభమై ఏడు సంవత్సరాలైనా సంప్రదాయ కోర్సులే కొనసాగుతున్నాయి. కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి కోర్సులను ఇక్కడ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు తప్పని నడక

హుస్నాబాద్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లేందుకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు అంబేడ్కర్ చౌరస్తా నుంచి అక్కన్నపేట రోడ్డు స్తూపం వరకు బారులు తీరుతారు. ద్విచక్ర వాహనదారులను, ట్రాక్టర్లు, ఇతర వాహనాలను లిఫ్ట్ అడుగుతూ ఇబ్బందులు పడుతుంటారు. ఆటోలో వెళ్లాలంటే రూ.50 చెల్లించాలి. పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మేనేజ్‌మెంట్ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు బస్టాండ్ వరకు రావాలంటే కిలోమీటరు నుంచి రెండు కిలోమీటరు వరకు ఉంటుంది. బస్టాండ్ నుంచి పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లేందుకు మరో మూడు కిలోమీటర్లు ఉంటుంది. ఇలా నడకతో విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. సమయానికి ఆర్టీసీ బస్సులు ఉండటం లేదు. బస్సు ఉన్నా కిషన్‌నగర్‌లో దిగి మరో అర కిలోమీటరు నడువాల్సి ఉంటుంది. ప్రతీ రోజు లిఫ్ట్ ఇచ్చే వాహనదారులు వీరి పట్ల విసుక్కుంటున్నారు.

తరువాయి 8వ పేజీలో



పాలిటెక్నిక్ కళాశాల



నంగునూరు మండలం బద్దిపడగ కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

గాలిలో దీపంలా రైతుల బతుకులు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రైతుల బతుకులు గాలిలో దీపంగా మారాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉండగా వడ్లు కల్లాలకు రాకముందే సంచులు పంపించి, ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు చేసి మరీ రైతుల నుంచి కొనుగోలు చేశామని గుర్తుచేశారు. కోతలు ప్రారంభమై నెలరోజులైనా రేవంత్ సర్కార్ వడ్లు కొనుగోలు చేయడం లేదన్నారు. సిద్దిపేట జిల్లాలో 3.60 లక్షల ఎకరాల్లో ఈ సీజన్‌లో వరి సాగు అయ్యిందని, 9 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండుతాయి, కానీ ఇప్పటివరకు అధికారులు వెయ్యి మెట్రిక్ టన్నుల వడ్లు కూడా కొనలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రారంభించకపోతే రైతులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు చేసి నిలదీస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, అనగొని లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దొంగలకు రిమాండ్

పెద్దశంకరంపేట, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): పెద్దశంకరంపేటలోని వెంకటేశ్వర కాలనీలో పోలీస్ కానిస్టేబుల్ సీమన్ ఇంట్లో జరిగిన దొంగతనం కేసును ఛేదించినట్లు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి ఆదివారం తెలిపారు. జగిత్యాలజిల్లా మెట్‌పల్లికి చెందిన వెల్లపు కాశీరాం, వెళ్లపు నిర్మల, కామారెడ్డి జిల్లాకు చెందిన వడ్డె శ్రీకాంత్ నిందితులు గుర్తించి వారి నుంచి చోరీ సొమ్ము 8 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చోరీ జరిగిన మూడు రోజుల్లోనే నిందితులను గుర్తించిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో పేట ఎస్‌ఐ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న కుటుంబసభ్యుల అరెస్టు

నర్సాపూర్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నర్సాపూర్ పట్టణంలోని శివాలయం వీధిలో నివాస ముంటున్న వికాస్, అతని తండ్రి రమేష్, తల్లి సరస్వతి ఇంట్లోనే ఎండు గంజాయి ప్యాకెట్లు గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేసి రూ.2 వేలు(94 గ్రాములు) విలువ చేసే గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ ముగ్గురుని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు. వీరికి ఎవరు సరఫరా చేస్తున్నారనే కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పటాన్‌చెరు మెట్రో రైలుకు పచ్చజెండా



- సంగారెడ్డి జిల్లాలో పరుగులు పెట్టనున్న మెట్రో
- పట్టాలెక్కనున్న పనులు
- నెరవేరనున్న పారిశ్రామిక వాడ ప్రజల కల
- డీపీఆర్ సిద్ధం కావడంతో పాటు నిధుల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

పటాన్‌చెరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పారిశ్రామికవాడ వాసుల మెట్రోరైలు స్వప్నం త్వరలో నెరవేరనుంది. మెట్రో కారిడార్ విస్తరణకు కావాల్సిన నిధులను మంజూరు చేస్తూ జీవో నంబర్ 196ను ప్రభుత్వం విడుదల చేయడంపై హర్షం వ్యక్తమవుతోంది. హైదరాబాద్‌కు తలమానికంగా ఉన్న మెట్రోరైలు రెండవ దశ విస్తరణలో భాగంగా మియాపూర్ నుంచి పటాన్‌చెరు పట్టణం వరకు ఏడవ కారిడార్ ప్యాకేజీ కింద విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇప్పటివరకు హైదరాబాద్‌కే పరిమితమైన మెట్రో సేవలు సమీప భవిష్యత్తులో సంగారెడ్డి జిల్లాలో సైతం పరుగులు పెట్టబోతోంది. దేశంలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడగా పేరుగాంచిన పటాన్‌చెరుకు మెట్రో సేవలు అవసరమని ఎప్పుడో గుర్తించారు. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4కిలోమీటర్ల (రెడ్ లైన్ ఎక్స్‌టెన్షన్) మెట్రో రూట్‌ను పూర్తి చేస్తారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) ప్రతిపాదించిన డీపీఆర్ ప్రకారం మియాపూర్ మీదుగా మదీనగూడ, చందానగర్, లింగంపల్లి బెల్ చౌరస్తా, అశోక్‌నగర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు పట్టణంలో మెట్రోస్టేషన్లు ఏర్పాటవుతాయని భావిస్తున్నారు.

నిత్యం వేలాదిమంది నగరానికి..

పటాన్‌చెరు నుంచి వేలాది మంది ప్రయాణికులు నిత్యం బస్సుల్లో నగరానికి వస్తుంటారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం నగరంలోని సుదూర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. అందుబాటులో ప్రజారవాణాకు కేవలం ఆర్టీసీ బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో కిక్కిరిసిన ట్రాఫిక్‌తో నిత్యం నరకం చవిచూడాల్సి వస్తోంది. మియాపూర్ నుంచి మెట్రో సేవలు ప్రారంభమైనా పటాన్‌చెరు నుంచి నగరానికి వచ్చే వారు బస్సుల్లో మియాపూర్ వద్ద దిగి మెట్రోలో వెళ్లేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అదే పటాన్‌చెరు వరకు మెట్రో రైలును ఏర్పాటు చేస్తే నేరుగా అక్కడే మెట్రో ద్వారా నగరంలోని సుదూర ప్రాంతాలకు తక్కువ సమయంలో చేరుకునే అవకాశం ఉంటుంది. హైదరాబాద్ నగరంలోనే అత్యంత రద్దీ రూట్‌గా పటాన్‌చెరు దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్ రూట్లను పేర్కొంటారు. జంటనగరాల పరిధిలోనే అత్యవసమైన రూట్‌గా మియాపూర్ పటాన్‌చెరు రూట్‌ను గుర్తించారు.

ఎంతో మందికి ప్రయోజనం..

గత దశాబ్దకాలంలో పటాన్‌చెరు వైపు హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోంది. పెరిగిన జనావాసాలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లతో కిక్కిరిసిపోతోంది. రోడ్లపై రద్దీపై విపరీతంగా పెరిగిపోతోంది. జనావాసాలకు తోడు వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పటాన్‌చెరు పారిశ్రామికవాడతో పాటు పక్కనే పాశమైలారం, బొల్లారం పారిశ్రామిక వాడల్లో పెద్ద ఎత్తున కార్మికులు, ఫార్మా పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులతో జాతీయ రహదారి రద్దీగా మారింది. పరిశ్రమలకు ముడి సరుకులు తెచ్చే లారీలు, ఇతర వాహనాలు సాధారణ ప్రయాణికుల వాహనాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రముఖమైన బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, ఆర్డినెన్స్‌ఫ్యాక్టరీ, కంది ఐఐటీ, గీతం యూనివర్సిటీ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఇక్కడే ఉండటంతో జనావాసాలు పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నాయి. ఈ ప్రాంతంలో మెరుగైన రవాణా వ్యవస్థ కోసం మెట్రోను విస్తరించాలన్న డిమాండ్ ఊపందుకుంది. పటాన్‌చెరుకు మెట్రో సేవలు విస్తరిస్తే కనీసం 20లక్షల జనాలకు మేలు కలుగుతుంది.

పట్టుబట్టి.. కొలువులు కొట్టి..

● మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ప్రీతి



ఉద్యోగ నియామక పత్రం అందుకుంటున్న ప్రీతి

కొండపాక, నవంబరు 3 : పట్టుదలతో కృషి చేస్తే విజయం వరించడం తథ్యం. ఇంట్లో వారి ప్రోత్సాహం కష్టపడే సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు. అందుకు ఉదాహరణ సిద్దిపేటకు చెందిన బుట్టి ప్రీతి. ఏడాదిలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. భర్త సాగర్ ప్రోత్సాహంతో లక్ష్యాన్ని చేరుకుంది. పట్టువదలకుండా చదివి ఆమె కోరుకున్న స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించింది. ప్రీతి చేర్యాల జూనియర్ కళాశాలలో చదువుకుని అనంతరం ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేసింది. వివాహ అనంతరం 2021లో బీఈడీ పూర్తి చేసింది. 2023లో సర్వ శిక్ష అభియాన్ కింద చిన్న కోడూరు మండలంలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం చేస్తూనే ప్రిపేర్ అయ్యింది. 2024లో గురుకులంలో టీజీటీ ఉద్యోగం పొందిన ఆమె తాజాగా 2024 డీఎస్సీలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ రెండింటికీ ఎంపికైంది. స్కూల్ అసిస్టెంట్‌ను ఎంపిక చేసుకొని శనివారం నియామకపత్రం కూడా అందుకున్నది. నేడు కడవేరుగు ఉన్నత పాఠశాలలో ఉద్యోగంలో చేరనుంది.

ఉత్సాహంగా కర్రసాము శిక్షణ



కర్రసాము శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలో వేద సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కర్ర సాము ట్రైనింగ్ క్యాంపు నిర్వహించారు. అకాడమీ వ్యవస్థాపకులు రమేశ్ మాస్టర్ నేతృత్వంలో మొదటిసారిగా కర్ర సాము నిర్వహించడం విశేషం. మన పూర్వీకులు నేర్చుకున్నటువంటి కర్రసాము విద్యను అందరికి అందించాలన్న ఉద్దేశ్యంతో అకాడమీని ఏర్పాటు చేసినట్టు మాస్టర్ రమేశ్ తెలిపారు. కర్రసాము ట్రైనింగ్ క్యాంపులో సుమారు 60 మంది విద్యార్థులు హాజరై వివిధ విభాగాలలో చతురస్రం కర్ర ఫైట్ విభాగాల్లో తర్ఫీదు పొందారు. అనంతరం హైదరాబాద్ నుంచి విచ్చేసిన కర్రసాము ఫెడరేషన్ ఇండియా తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ వినోద్ మాస్టర్ హాజరై విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అశోక్, వినయ్‌కుమార్, కళ్యాణ్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

అత్తే హతమార్చింది

వీడిన యువకుడి హత్యకేసు మిస్టరీ



విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజుల క్రితం హత్యకు గురైన యువకుడి కేసు మిస్టరీ వీడింది. మృతుడి అత్తే ప్రధాన నిందితురాలని సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని ర్యాలమడుగు గ్రామానికి చెందిన దొంతి మహేష్(32)కు పదేళ్ల క్రితం ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకు చెందిన లావణ్యతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు. మహేష్ మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా భార్యను కొట్టేవాడు. ఆ హింస భరించలేక భార్య పలుమార్లు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లినా.. అక్కడికి వెళ్లి భార్య, అత్తతో గొడవపడి వారిని కొట్టేవాడు. మహేష్ తండ్రి మృతిచెందగా వచ్చిన రైతుబీమా డబ్బులు జల్సాలకు ఖర్చుచేశాడు. దీంతో పాటు ఉన్న రెండెకరాల భూమిని అమ్మకానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. కూతురును చిత్రహింసలకు గురిచేయడం, పిల్లలను సరిగ్గా చూడకపోవడం, భూమిని అమ్మేస్తే పిల్లలకు ఆసరా ఉండదని భావించిన అత్త వీరమణి ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నది. పదిరోజుల క్రితం మహేష్ భార్యతో గొడవపడి చిన్న కూతురును వేడి నీళ్లల్లో పడేశాడు. చిన్నారికి గాయాలుకాగా చికిత్స నిమిత్తం ఖేడ్ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. గత నెల 30న మహేష్ ఆస్పత్రికి రాగా.. అక్కడే ఉన్న అత్త పథకం ప్రకారం.. ఖేడ్ మండలం నర్సాపూర్‌కు చెందిన కిష్టయ్యను పిలిపించింది. కిష్టయ్య, మహేష్, వీరమణి ముగ్గురూ కలిసి అంత్వార్ మార్గంలోని జూక్కల్ శివారులో ఖాళీ స్థలానికి వెళ్లారు. అక్కడ మహేష్‌కు ఫుల్‌గా మద్యం తాగించారు. ఇదే అదునుగా భావించిన అత్త వీరమణి, కిష్టయ్య ప్లాస్టిక్ తాడుతో మహేష్ గొంతుకు బిగించి ఊపిరాడకుండా చేశారు. అయినా ప్రాణం పోలేదని నిర్ధారించుకుని రోడ్డుపైకి లాక్కొచ్చారు. అక్కడ అత్త రాయితో మహేష్ ముఖంపై గట్టిగా కొట్టి హత్యచేసిందని పోలీసులు తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా.. వీరమణి, కిష్టయ్య నిజం ఒప్పుకున్నారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ, ఎస్‌ఐ వెల్లడించారు.

కదిలిస్తే కన్నీళ్లే..

- ఒకే కుటుంబంలో నలుగురి మృతితో పోతారంలో విషాద ఛాయలు
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు
- పూర్తయిన అంత్యక్రియలు



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

"నాన్న.. లే నాన్న.. అంటూ తండ్రి మృతదేహంపై పడి అతడి ఒక్కగానొక్క కూతురు గుండెలవిసెలా ఏడ్వడం.. మీ అమ్మ వెళ్లిపోతున్నది బిడ్డా.. నీకు అమ్మ అనే పిలుపు దూరమవుతున్నది, మీ అక్క పిలుస్తున్నది లేవుండ్రి బిడ్డ అంటూ భార్యాబిడ్డల మృతదేహాల వద్ద తండ్రి తన పెద్ద బిడ్డను పట్టుకుని రోధించడం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. "

మనోహరాబాద్, నవంబరు (ఆంధ్రజ్యోతి)3: రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. శనివారం మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో బైకును ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో అక్కడికక్కడే నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు ఆంజనేయులు కూతురు భానుప్రియ నాన్న లే నాన్న అంటూ ఏడుస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. మృతురాలు మన్నె లావణ్య భర్త కుమార్ పెద్ద కూతురు సంజనను పట్టుకుని పెద్దగా ఏడ్వడం ప్రతి ఒక్కరినీ కదిలించింది. 'లే లావణ్య.. మీ అక్క పిలుస్తుంది రండి అమ్మా అంటూ భార్య, కూతుర్లను కుమార్ పిలుస్తున్న తీరు చూపరులను కంటితడి పెట్టించింది. కాగా, బాధిత కుటుంబ సభ్యులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబలకు అండగా ఉంటామని, అన్ని విధాలుగా ఆదుకుంటామని వారు తెలిపారు.

ఇంట్లో చోరీ

● రూ.15 లక్షల విలువ చేసే బంగారం అపహరణ

పటాన్‌చెరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బానూర్ లైఫ్ స్టైల్ డ్రీమ్ హోమ్స్‌లో శనివారం రాత్రి చోరీ జరిగింది. బీడీఎల్ పోలీసులు అందించిన సమాచారం ప్రకారం భాను లైఫ్ స్టైల్ డ్రీమ్ హోమ్స్‌లో ఉంటున్న శరత్, సుప్రియ దంపతులు మాదాపూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి సెకండ్ షో సినిమాకి వెళ్లి ఇంటికి వచ్చే చూడగా మెయిన్ గేటు తాళం పగలగొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.15 లక్షల విలువ చేసే బంగారం, 5 వేల నగదు దొంగలు కనిపించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శివ్వంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా శివ్వంపేట మండలం శభాష్‌పల్లి శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు తూప్రాన్ సీఐ రంగకృష్ణ ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ. 1,07,500 నగదు, 8 సెల్‌ఫోన్‌లు, 3 కార్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బస్టాండ్‌లో యువకుడి హత్య

- ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన గుర్తు తెలియని దుండగులు
- మెదక్ జిల్లా చిన్నశంకరంపేటలో ఘటన
- పదిరోజుల వ్యవధిలో రెండు హత్యలు

చిన్నశంకరంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని అనంత పద్మనాభగుట్ట వద్ద బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఉదయం స్థానికులు బస్టాండ్ వద్ద కాలిపోయిన మృతదేహాన్ని చూసి, భయంతో పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ వెంకట రాజాగౌడ్, ఎస్‌ఐ నారాయణగౌడ్ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, తూప్రాన్ డీఎస్పీ వెంకట్రామ్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. క్లూస్‌టీం, జాగిలాలను రప్పించి ఆధారాలను సేకరించారు. బస్టాండ్ పరిసరాలను, రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. గతనెల 24 చిన్నశంకరంపేట ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తిని దారుణంగా హత్యచేసి ఒంటిపై నిప్పంటించిన ఘటన మరువక ముందే.. మరో హత్య వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై ఎస్పీ మాట్లాడుతూ దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ కోసం చిన్నశంకరంపేట పోలీసులను సంప్రదించాలన్నారు.

వరుస హత్యలతో భయం.. భయం..

వరుస హత్యలతో చిన్నశంకరంపేట ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే రెండు దారుణ హత్యలు చోటు చేసుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. గత నెల 24న ప్రభుత్వం ఆసుపత్రి ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తిని దుండగులు హత్య చేసి నిప్పంటించారు. ఇది మరవకముందే మరో ఘటన చేసుకోవడం కలకలం రేపుతున్నది. మండల కేంద్రంలోని పరిశ్రమల్లో పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు వస్తుంటారు. మృతులు స్థానికులే అయిఉంటే హత్యకు గురైన వివరాలు తెలిసి ఉండేవని, స్థానికేతరులు కాబట్టే తెలియడంలేదని స్థానికులు అంటున్నారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



ఘటనా స్థలంలో జాగిలంతో తనిఖీ..



సదర్ ఉత్సవాలలో పాల్గొన్న నీలం మధు

యాదవుల సంస్కృతికి ప్రతీక సదర్

● కాంగ్రెస్ నాయకుడు నీలం మధు

పటాన్‌చెరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదవుల సంస్కృతికి సదర్ ఉత్సవాలు ప్రతీక అని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు అన్నారు. ఆదివారం పటాన్‌చెరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యత, జంతువులపై వారికున్న ప్రేమను చాటుతున్నాయన్నారు. సదర్ ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక పండగగా గుర్తింపు ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న నీలం మధు, కార్పొరేటర్ పుష్పనగేష్‌యాదవ్, నాయకులు నరసింహారెడ్డి, దేవరాజ్, కృష్ణయాదవ్, మధు, శ్రీనివాస్, వెంకటేశం తదితరులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

తేనెటీగల దాడిలో గొర్రెల కాపరి మృతి



బాలయ్య(ఫైల్)

జగదేవ్‌పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన ఆదివారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోకర్ల బాలయ్య(45) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో జీవాల మేత కోసం గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు కొమ్మలు తెంపుతుండగా అకస్మాత్తుగా ఆ చెట్టుకు ఉన్న తేనటీగల గుంపు బాలయ్యను చుట్టుముట్టాయి. దీంతో బాలయ్య గ్రామంలోకి పరుగు పెట్టి ఒక ఇంటిలోకి దూరినప్పటి కీ వదిలిపెట్టకుండా కరిచాయి. ఇది గమనించి గ్రామస్థులు గడ్డితో మంటలు పొగ పెట్టి తేనటీగలు తరిమికొట్టారు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన బాలయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వంటిమామిడిలోని ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

అందమైన రాత.. ముత్యాల పోత

- వృత్తి వ్యవసాయ అధికారి.. ప్రవృత్తి 'కాలిగ్రఫీ' ఆర్టిస్ట్
- చేతి రాతతో కళకు జీవం పోస్తున్న ఏఈవో వంశీకృష్ణ
- కాలిగ్రఫీతో మంత్రముగ్ధులను చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి



సంగారెడ్డి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : మనిషి కదిలితే ఒక కళ.. మనసు కదిలితే ఒక కళ.. ప్రకృతి ప్రసాదించిన 64 కళల్లో ఒక్కొక్కరిది ఒక కళ. అందులో అందమైన చేతిరాత ఓ కళనే. అక్షరాలు పొందికగా రాయాలంటే ఎంతో ఓర్పు నేర్పు ఉండాలి. జన్మత ఉన్న అభిరుచికి అభ్యాసం తోడైతే అద్భుతంగా రాణిస్తారు. ముత్యాల పోతలా చూడచక్కని అందమైన చేతిరాతతో అందరిని మెప్పిస్తున్నారు ఓ ప్రభుత్వ ఉద్యోగి. గురువుల ప్రోత్సాహం తనలోని ఉత్సాహం కాలిగ్రఫీ ఆర్టిస్ట్‌గా మార్చిందంటున్నారు సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల వ్యవసాయ విస్తరణాధికారి వంశీకృష్ణ.

కాలిగ్రఫీతో కట్టిపడేస్తూ

నిజాంపేట మండల వ్యవసాయ విస్తరణ అధికారిగా(ఏఈవో) పనిచేస్తున్న వంశీకృష్ణది మెదక్ జిల్లా పెద్దశంకరంపేట. చేతి రాతతో ప్రపంచస్థాయి గుర్తింపు సాధించాలన్నదే ఆయన తపన. ఏఈవోగా వృత్తిని కొనసాగిస్తూనే ప్రవృత్తిగా కాలిగ్రఫీ ఆర్టిస్ట్‌గా మారాడు. తన చేతి రాతతో మంత్రముగ్ధులను చేస్తున్నాడు. హైదరాబాద్‌లో ఏడాదిన్నర కాలం పాటు వంశీకృష్ణ కాలిగ్రఫీ ఆర్టిస్ట్‌గా శిక్షణ తీసుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో పెన్ ఎక్స్‌పోజ్ కార్యక్రమంలో పాల్గొని అందరి మన్ననలు పొందారు.





ఏదో ఆశించి కాదు.. ఇష్టంతో నేర్చుకున్నా : వంశీకృష్ణ

అందమైన చేతి రాత రాస్తే ఆ రాత చూసిన వారు... రాసిన వ్యక్తి ఆ ప్రాంతంలో లేకపోయినా ఆ రాత ఎవరు రాశారని, స్క్రిప్ట్ చూసిన వారి నుంచి పొగడ్తలు వస్తుంటాయి. ఆ గొప్పదనం చేతి రాతకు ఉంటుంది. చేతి రాత అనేది ఒక సైన్స్. గీత తలరాతను మారుస్తుంది అనే దానికి కాలిగ్రఫీ ఆర్ట్ ఒక నిదర్శనం. చిన్నప్పటి నుంచి రాయడంపై నాకు ఆసక్తి. కాలిగ్రఫీలో చాలా రకాలు ఉంటాయి. అందులో నేను నేర్చుకున్నది ఇంగ్లిష్‌లో కాపర్ ప్లేట్ కాలిగ్రఫీ. ఏదో ఆశించి కాకుండా ఇష్టంతో కాలిగ్రఫీ ఫీల్డ్‌లోకి వచ్చాను. భవిష్యత్తులో పలువురికి నేర్పిస్తాను. రాయడం వల్ల మనిషి ఒత్తిడి, ఇతర సమస్యలను దూరం చేస్తుంది. ఆబ్లిక్ హోల్డర్ పెన్‌తో అందంగా రాస్తున్నపుడు అన్ని మర్చిపోతారు. మెడిటేషన్ చేసినప్పుడు మైండ్ ఎంత ప్రశాంతంగా ఉంటుందో కాలిగ్రఫీ చేసినప్పుడూ అంతే ప్రశాంతంగా ఉంటుంది. అందమైన రాతపై ఆసక్తి ఉన్నవారు కాలిగ్రఫీ నేర్చుకోండి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్

బెజ్జంకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిల్లాపూర్ మోయతుమ్మెద వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

ఫుడ్ పాయిజన్ కారకులపై చర్యలు తీసుకోవాలి

● డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి

గజ్వేల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్‌కు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగడంతో విద్యార్థినులు ఆసుపత్రి పాలయ్యారన్నారు.

నత్తనడకన కల్వర్టు పనులు

● ప్రమాదకరంగా గాంధీచౌక్, బస్టాండ్ దారి
● ప్రయాణికులకు తప్పని తిప్పలు

చేర్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట-సిరిసిల్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొన్నాళ్లక్రితం జనగామ - సిద్దిపేట ప్రధాన రహదారిపై విస్తరణ పనులు చేపట్టారు. ఈక్రమంలో చేర్యాల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద కల్వర్టు పనులు అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్తనడకన కొనసాగుతున్నాయి.

ఆక్రమణల కారణంగా

భూగర్భ జలాల నీటి మట్టం పెంపొందింపచేయడంతో పాటు పట్టణ ప్రజల దాహార్తి తీర్చే కుడిచెరువులోకి వరదనీటి మళ్లింపుకోసం ఎన్నో ఏళ్లక్రితం కల్వర్టు నిర్మించారు. కానీ పలువురు నాలానా ఆక్రమించుకోవడంతో పాటు పూడిక తీయని కారణంగా వర్షాకాలంలో కల్వర్టు సమీప ప్రదేశాల్లో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి.

ఒక వైపే రాకపోకలు

జాతీయ రహదారి నిర్మాణం పనుల కారణంగా రోడ్డును విస్తరించడంతో కల్వర్టును కూడా అదేతరహాలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఎత్తుపెంచుతూ బ్రిడ్జి విస్తరణ పనులు చేపట్టారు. అందుకు ఓ మార్గాన్ని మూసివేసి మరోమార్గం గుండా వాహనాల రాకపోకలు కొనసాగిస్తుండడంతో వాహన రాకపోకల్లోనూ తీవ్ర అంతరాయం కలుగుతున్నది. పట్టణానికి ల్యాండ్‌మార్క్‌గా, నాలుగుదారుల కూడలిగా ఉన్న గాంధీచౌక్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. పనుల్లో జాప్యంపై ప్రజలు, ప్రయాణికులు మండిపడుతున్నారు.



గాంధీచౌక్ వద్ద కొనసాగుతున్న కల్వర్టు పనులు

గతంలో రోడ్డుపక్కన ఉన్న గాంధీ విగ్రహం ప్రస్తుతం బ్రిడ్జి విస్తరణతో దారి మధ్యకు చేరుకోవడంతో పక్కకు తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. గాంధీ జంక్షన్ అభివృద్ధికి గతంలో మున్సిపల్ నిధులు కేటాయించినప్పటికీ జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా నిలిపివేశారు. ప్రస్తుత పనుల దృష్ట్యా గాంధీ విగ్రహాన్ని పక్కన నెలకొల్పాల్సి వస్తుండటం, ఇటీవలే చేర్యాల మున్సిపల్ సుడాలో విలీనం కావడంతో జంక్షన్ల అభివృద్ధికి దోహదం కానున్న నేపథ్యంలో విగ్రహ స్థానచలనానికే పరిమితం కాకుండా, జంక్షన్ అభివృద్ధిపైనా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. నిత్యం ఈ దారి వెంబడి వాహనాల రాకపోకలు పెరుగుతున్న దృష్ట్యా ప్రమాదాలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు చొరవచూపి బ్రిడ్జి పనులు వేగవంతం చేసి త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కల్వర్టు నిర్మాణం కారణంగా వన్‌వేలో వెళ్తున్న వాహనాలు

కుట్టు కూలి ఇంతేనా?

ఐదో పేజీ తరువాయి

రెండో విడతను మొత్తంలో పెండింగ్ పెట్టడంతో మహిళలు అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రెస్ మెటీరియల్ అందించేటప్పుడు ఒక్కో యూనిఫామ్‌కు సంబంధించి 75 రూపాయలు ఇస్తామని డీఆర్డీఏ అధికారులు మహిళలకు చెప్పారు. కానీ, మొదటి విడతలో రూ.50 మాత్రమే పంపిణీ చేశారు. ఇందులోనూ డ్రెస్ కటింగ్ పేరిట పది రూపాయలు కట్ చేసుకుని కేవలం రూ.40 మహిళలకు అందించారు. యూనిఫామ్‌లకు బయట కాజాలను కుట్టించేందుకే తాము రూ.10 వరకు చెల్లించామని, ఇప్పుడు రూ.40 చెల్లించడంతో తమకు మిగిలిందేమీ లేదని ఆర్డర్లు తీసుకున్న మహిళలు వాపోతున్నారు. డ్రెస్ కుడితే కేవలం రూ.40 ఇవ్వడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలు గడుస్తున్నా రెండో విడత యూనిఫామ్‌లకు సంబంధించిన బిల్లు చెల్లించడం లేదని, తాము చిన్నచితకా దుస్తులను కుడుతూ బతికేవారమని, ఇన్నాళ్లు కుట్టుకూలి ఇవ్వకపోతే ఎలా అని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

శిక్షణ పొందే వారితో కుట్టించడంతో సమస్యలు

అంతకుముందు ఏజెన్సీల ద్వారా అనుభవం కలిగిన దర్జీలచే కుట్టించడంతో సరైన కొలతలతో, నాణ్యతా ప్రమాణాలతో కూడిన డ్రెస్సులు అందాయి. కానీ ప్రస్తుతం అనుభవం లేకుండా శిక్షణ పొందే వారితో యూనిఫామ్‌లను కుట్టించడంతో విద్యార్థులు సతమతమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1400 మంది మహిళలు స్కూల్ యూనిఫామ్‌లను కుట్టగా ఇందులో సగానికిపైగా నూతనంగా శిక్షణ పొందిన వారు, ఇప్పుడిప్పుడే కుట్టుమిషన్‌లో శిక్షణ పొందుతున్న వారు ఉన్నారు. దీంతో స్కూల్ యూనిఫామ్‌ల తయారీలో అనేక సమస్యలు ఎదురయ్యాయి. షర్టు, ప్యాంటు కొలతలు సరిగ్గా లేకుండా, కుట్టులో మెలకువలు పాటించకుండా కుట్టడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యాశాఖ యంత్రాంగంతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు కూడా ఆరోపిస్తున్నారు. చాలామంది విద్యార్థులు ప్రభుత్వం నుంచి వచ్చిన డ్రెస్సులను వేసుకోవడానికి ఇబ్బందులను ఎదుర్కొంటుండడంతో మళ్లీ క్లాత్ తీసుకువచ్చి తల్లిదండ్రులు ప్రైవేట్‌గా కుట్టిస్తున్నారు. అటు అనుభవ లేమీతో పాటు, నామమాత్రపు ధరలు చెల్లిస్తుండడంతో మహిళలు యూనిఫామ్‌లను ఇష్టారీతిన కుట్టి ఇచ్చారు. డీఆర్డీఏ, మెప్మా అధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులకు సమస్యలు తప్పడం లేదు.

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం

● సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇటీవల వికారాబాద్‌లో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీల్లో తైక్వాండో అసోసియేషన్ సిద్దిపేట జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరించారు. వారిని ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అభినందించారు. అసోసియేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ అండర్ 14 విభాగంలో పి పురంధర, అండర్ 20 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, ఎం పునిత్‌రెడ్డి అండర్ 29 కేజీల విభాగంలో సిల్వర్, నిశాంత్ అండర్ 32 కేజీల విభాగంలో సిల్వర్, టీ. తనీష్ వినయ్ అండర్ 41 కేజీల విభాగంలో బ్రాన్స్ మెడల్ సాధించారన్నారు.



సిద్దిపేట టౌన్: విద్యార్థులను అభినందిస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులరాజనర్సును సిద్దిపేట పట్టణంలోని ఆమె నివాసంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

● సిద్దిపేట కల్చరల్: ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట విపంచి కళానిలయంలో నిర్వహించిన టీపీటీఎఫ్ నాయకుడు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు పొన్నమల్ల రాములు ఉద్యోగ విరమణ అభినందనసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, టియూడబ్ల్యూజే ఐజేయూ నాయకుడు రంగాచారి ఉన్నారు.

● నంగునూరు: మండలంలోని ఘనపూర్ గ్రామా శివారులో నిర్మిస్తున్న పంప్ హౌస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పంప్‌హౌస్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు.

అంబులెన్స్‌లో ప్రసవం

● పురుడు పోసిన '108' సిబ్బంది



శిశువును చూపుతున్న మెడికల్ టెక్నీషియన్ గణేష్

కొండపాక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళకు 108లో సిబ్బంది పురుడు పోశారు. చేర్యాల మండలం చిట్యాలకు చెందిన సౌందర్య అనే గర్భిణి శనివారం అర్ధరాత్రి తర్వాత పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు కొండపాక 108కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది గణేష్, రమేష్ అక్కడికి చేరుకుని సిద్దిపేటకు తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో మార్గమధ్యంలో వాహనాన్ని నిలిపి హైదరాబాద్‌లోని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసు ఎమర్జెన్సీ వైద్యులతో మాట్లాడి వారి సూచనలు పాటిస్తూ మహిళకు పురుడు పోశారు. ఆ మహిళ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దౌల్తాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాజులపల్లిలో ఇటీవల విద్యుదాఘాతంతో మారుపాక అర్జున్ ఇల్లు దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబసభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి సహాయం అందే విధంగా కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఆయనవెంట మాజీ సర్పంచులు అప్పవారి శ్రీనివాస్, బొల్లి చంద్రం, బీఆర్ఎస్ మండల యువజనశాఖ అధ్యక్షుడు రాజేందర్, మండల నాయకులు పంజా స్వామి, అంజి తదితరులున్నారు.

'అవినీతి రహిత సమాజ స్థాపనకు పాటుపడాలి'

చేర్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొమురవెల్లి మల్లన్న ఆలయ ద్వితీయ శ్రేణి అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో చేపట్టిన కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం ప్రతినిధి దొమ్మాట రాజు మాట్లాడుతూ.. అవినీతి రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములవ్వాలని అన్నారు. ప్రతీ పౌరుడు అవినీతి వ్యతిరేక విధానానికి మద్దతుపలకాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌వైకే వలంటీర్ కటకం అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ జెండా ఎగురవేత

వర్గల్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 3 : వర్గల్ మండలం నాచారంలో ఆదివారం ధర్మ సమాజ్ పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లా నాయకుడు జుర్రు సుధాకర్‌యాదవ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల చంద్రమోహన్, డప్పు లక్ష్మన్, మాదిగ జాగృతి సంఘ నాయకులు కూచారం దయానంద్, మంగని కృష్ణ, బక్కోళ్ల యాదగిరితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.


గత ప్రభుత్వ పాలనలో విద్యారంగం నిర్వీర్యం

● డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేయడంతో పాటు పదేళ్ల పాలనలో పేద ప్రజలను, విద్యార్థులను ప్రభుత్వ విద్యకు కేసీఆర్ ప్రభుత్వం దూరం చేసిందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆరోపించారు. డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచిన సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని బాలికల హబ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, ప్లకార్డులతో థ్యాంక్యూ సీఎం సాబ్ అని ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల, ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు కనీసం కాస్మెటిక్, డైట్ చార్జీలు పెంచలేదన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, మండల విద్యాధికారి కృష్ణ, వార్డెన్స్ లక్ష్మి, స్వప్న, జగదేవ్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నర్సింహారెడ్డి, వహీద్, యాదయ్య, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు తదితరులున్నారు.

● గజ్వేల్ రూరల్: ప్రభుత్వం గురుకుల పాఠశాల హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడంపై బీసీ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొమ్ము ఉమేష్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు అకారం రాజు యాదవ్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు కొమ్ము రాజు, టౌన్ కార్యదర్శి ప్రవీణ్, తిరుపతి, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

● హుస్నాబాద్‌రూరల్: డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచడం పట్ల హుస్నాబాద్ సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తు పాఠశాలలో కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



గజ్వేల్: బాలికల హబ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు, నాయకులు

'ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి'

చేర్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం అయినాపూర్‌లో వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభిచాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు తాడూరి రవీందర్ కోరారు. ఐనాపూర్‌లో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రారంభించి వారం రోజులు గడుస్తున్నా రైతులకు కనీసం గన్నీసంచులు కూడా అందించలేదన్నారు. రైతులు అయోమయానికి గురవుతూ దళారులకు ధాన్యం విక్రయించుకునే దుస్థితి దాపురించిందన్నారు. ఆయన వెంట నాయకులు తేలు ఇస్తారి, సున్నం యాదగిరి, కానుగుల రాజు, పాశం చంద్రయ్య, దయ్యాల అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థినికి రవీంద్రభారతిలో సన్మానం



జ్ఞాపిక అందుకుంటున్న ప్రహరిని

సిద్దిపేట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సహకారంతో మాచిరాజు బాల సాహిత్య పీఠం రెండు తెలుగు రాష్ట్రాల్లో బాలల కథల పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కారంకంటి ప్రహరిని ప్రోత్సాహక బహుమతికి ఎంపికై నగదు పురస్కారాన్ని గెలుచుకుంది. ఈ విషయాన్ని ఆదివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు షౌకత్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు జ్ఞాపిక అందుకుంది. ప్రహరినిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీతో పాటు ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మాట్ల లక్ష్మి అభినందించారు. రవీంద్ర భారతీలో జరిగిన కార్యక్రమంలో మాచిరాజు బాల సాహిత్య పీఠం వ్యవస్థాపకుడు మాచిరాజు కామేశ్వరరావు, ప్రొ. మృణాళిని, నాగసూరి వేణుగోపాల్, కన్నెగంటి అనసూయ, చొక్కాపు వెంకటరమణ, పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు కరుణ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ఉచిత వైద్య శిబిరం

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం తెలంగాణ గ్యాడ్యుయేట్స్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు బండారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పట్టణంలోని గాంధీరోడ్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు బత్తుల శంకర్‌బాబు, చిత్తారి రవీందర్, సీపీఐ నాయకులు గడిపె మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు మలికార్జున్‌రెడ్డి కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.



ఉచిత వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ ఆకుల రజిత

'ఆర్చరీ'ని గ్రామాల్లోనూ విస్తరించాలి

● ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్చరీ క్రీడను గ్రామాల్లోనూ విస్తరించేందుకు కృషిచేయాలని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఆర్చరీ అధ్యక్షుడిగా ఎన్నికైన తలకొక్కుల రాజుకు ఆదివారం నిర్వహించిన అభినందన సభలో మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ.. గజ్వేల్ పట్టణానికి చెందిన రాజుకు ఉన్నత పదవి దక్కడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, ఉప్పల మెట్టయ్య, భాగ్యలక్ష్మి- దుర్గాప్రసాద్, బొగ్గుల చందు, గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండరి, పద్మశాలి సంఘ అధ్యక్షుడు రాజారాం, నిర్వాహకులు రమణాకర్, శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4 లక్షల ఎల్‌వోసీ అందజేత

మద్దూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సలాఖ్‌పూర్‌కు చెందిన బియ్యం రమేష్ కిడ్నీ మార్పిడికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని బీసీ సంక్షేమ, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి రూ.4 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ తెలిపారు. మంజూరైన ఎల్‌వోసీ పత్రాన్ని ఆదివారం బాధిత కుటుంబసభ్యులకు అందించినట్లు ఆలయన వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాపాక బుచ్చిరెడ్డి, గ్రామశాఖ ఉపాధ్యక్షుడు ఎర్ర మల్లేశం, ఎలికట్టి శ్రీనివాస్, నర్సింగారావు, నారాయణ గౌడ్, బియ్యం కిష్టయ్య, సింగిరెడ్డి బుచ్చిరెడ్డి, బర్రె కృష్ణారెడ్డి, ఎర్ర ఆనందం, గడిపె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ భగినీహస్త భోజనం

సిద్దిపేట కల్చరల్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట శివాజీ నగర్‌లో బ్రహ్మకుమారీస్ అధ్వర్యంలో భగినీహస్త భోజనం కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ సోదరులను ఆహ్వానించి దీపావళి, బాయ్‌ధూజ్ కార్యక్రమాన్ని చేపట్టారు. సోదరులకు తిలకం దిద్ది, హరతులిచ్చి భోజనాలు పెట్టారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకురాలు భవాని, డా. శేషభూపతి, చింతల ఉదయ్‌కుమార్, ఓంకార్, హరిప్రసాద్, అమరేందర్ రెడ్డి, వెంకటేష్, బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నిరుద్యోగులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారు

● గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

గజ్వేల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లో రాజకీయ నిరుద్యోగులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గజ్వేల్ ఓ బీఆర్ఎస్ నేత రాజకీయ నిరుద్యోగిగా మారి మతిభ్రమించిన వాడిలా మాట్లాడుతున్నారని, ఎన్నడూ ఎన్నికల్లో గెలవలేకపోయినా ఆయన గతంలో ఉన్న అధికార పార్టీలో చేరితే ఆ పార్టీ ఓడిపోవడం.. తర్వాత కాంగ్రెస్‌లో చేరటానికి ప్రయత్నిస్తే కాంగ్రెస్ తలుపులు మూయడంతో కాంగ్రెస్‌పై బురద చెల్లే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సీసీఐకి సంబంధం ఉందా? అని ప్రశ్నించారు. కేసీఆర్ బండారం బయటపెడతామన్న ఓవైసీకి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. వారితో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు వహీద్, నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్..

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ఫోన్‌ను అరగంటలో స్వాధీనం చేసుకుని పోలీసులు బాధితుడికి అందజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం హుస్నాబాద్ పట్టణంలో ఓ హమాలీ కార్మికుడు తన ఫోన్‌ను ఆదివారం పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు వెంటనే హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేష్ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ మొగిళినాయక్ సిగ్నల్స్ ఆధారంగా ఫోన్‌ను గుర్తించి అరగంటలోపే బాధితుడికి అప్పగించాడు.

ఆలయాలకు కార్తీక శోభ

● తొలి ఆదివారం కావడంతో భారీగా తరలివచ్చిన భక్తులు
● కార్తీక జ్యోతులు వెలిగించిన మహిళలు

చేర్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక శోభ సంతరించుకుంది. పరమశివుడికి ప్రీతికరమైన మాసంతో పాటు తొలి ఆదివారం కావడంతో మల్లన్న దర్శనానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండప పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తులు గంగిరేగుచెట్టు ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి వేడుకున్నారు. కాగా కార్తీకమాసం సందర్భంగా దేవాదాయశాఖ ఆదేశానుసారం సాయంత్రం ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు ప్రమిద, నూనె, ఒత్తులు అందించి ప్రసాదం పంపిణీ చేశారు.ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.



చేర్యాల: పట్నం వేస్తున్న భక్తులు

కొమురవెల్లి మల్లికార్జునస్వామిని ఐపీఎస్ అధికారి రవీందర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా మల్లన్నకు అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. అంతకుముందు చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి కుటుంబసమేతంగా మల్లన్నను దర్శించుకున్నారు.



వర్గల్: నాచగిరి క్షేత్రంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

వర్గల్: మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. 87 జంటలు వ్రతంలో పాల్గొని పూజలు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్ అన్నపూర్ణ తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. ఆలయ సిబ్బంది సుధాకర్, నరేందర్, పాండు పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల నడకయాతన

ఐదో పేజీ తరువాయి

ఇక విద్యార్థినులు లిఫ్ట్ అడిగే పరిస్థితి లేక, ఆటో, బస్సుల్లో పోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే కిషన్‌నగర్ రెక్వెస్ట్ బస్టాండ్ నుంచి కళాశాల వరకు మట్టి రోడ్డు మాత్రమే ఉండటంతో వర్షాకాలం బురదగా మారి నడక దారి అధ్వానంగా మారుతోంది.

అనేక సమస్యలు

పాలిటెక్నిక్ కళాశాలకు పదెకరాల స్థలం ఉంది. కళాశాల ప్రాంగణంలో బాలికలు, బాలుర హాస్టళ్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు నాలుగు సంవత్సరాలుగా కోరుతున్నారు. కళాశాలలో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రిన్సిపాల్ డిప్యూటేషన్‌పై వచ్చారు. హెడ్ ఆఫ్ సెక్షన్ పోస్టుతో పాటు లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్, ఇతర లెక్చరర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో పాఠశాలతో పాటు ఇతర విభాగాల్లో విద్యార్థులు నష్టపోతున్నారు. అదే కాకుండా లైబ్రేరీ ఉన్నా సరైన పుస్తకాలు లేవు.

ఐదు కిలోమీటర్లు వెళ్లాలి



మాది జగిత్యాల జిల్లాలోని హాజీపూర్. ప్రస్తుతం హుస్నాబాద్ ఎస్టీ బాలికల మేనేజ్‌మెంట్ హాస్టల్ ఉంటున్నా. ఈ హాస్టల్ బస్టాండ్‌కు రెండు కిలోమీటర్లుంటుంది. అక్కడి నుంచి కళాశాల మూడు కిలోమీటర్లు. ప్రతీ రోజు ఐదు కిలోమీటర్లు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రూ.100 వెచ్చించాల్సి వస్తుంది. కళాశాల వద్ద హాస్టల్ ఉంటే ఇబ్బందులు తప్పుతాయి.

- ఎస్.అంజలి, విద్యార్థిని

కళాశాల వద్ద హాస్టల్‌ను నిర్మించాలి



మాది కరీంనగర్. హుస్నాబాద్‌లోని బీసీ బాలికల మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నా. హాస్టల్‌కు బస్టాండ్ కిలోమీటరు ఉంటుంది. అక్కడి నుంచి కాలేజీకి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. సమయానికి బస్సులు రావడం లేదు. మాకు ఇది ప్రధాన సమస్యగా మారింది. హాస్టల్‌ను ఏర్పాటు చేసే వరకు ప్రత్యేకంగా విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలి.

కె.శ్రీవిద్య, విద్యార్థిని